వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 058
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
ఫిబ్రవరి 11, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## పీడీఎస్ బియ్యం నాణ్యతపై పార్లమెంట్‌లో ఎంపీ కావ్య గళం

- కేంద్రాన్ని నిలదీసిన వరంగల్ ఎంపీ
- తెలంగాణలో ఒక్క ఫిర్యాదూ రాలేదు
- కేంద్ర మంత్రి జోషి సమాధానం



8లో..

### ములుగు మున్సిపల్ పోలింగ్
## వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ నిశిత పరిశీలన

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- ప్రశాంతంగా సాగుతున్న పోలింగ్



2లో..

## పెళ్లి పందిరిలా పోలింగ్ కేంద్రం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఫిదా
- 'హరిత పోలింగ్ కేంద్రం' అలంకరణపై ప్రశంసలు
- అధికారులతో కలిసి ఫొటోలు దిగిన సీపీ



2లో..

### ప్రజాస్వామ్య పండుగలో
## పర్యావరణ చైతన్యం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పురోత్సవంలో 'హరిత' కాంతి
- ఓటర్లకు జిల్లా కలెక్టర్ వినూత్న స్వాగతం
- ఓటేసిన వారికి పెన్నులు, రిస్ట్ బ్యాండ్‌ల పంపిణీ





- ఉదయం నుంచే భారీ క్యూ లైన్లు
- మధ్యాహ్నం 1 గంటకే 50శాతం పైగా పోలింగ్
- సాయంత్రం 5 దాటినా క్యూలైన్ లోనే ఓటర్లు
- పలుచోట్ల చెదురుముదురు ఘటనలు
- భూపాలపల్లిలో నగదు కలకలం

# బిగ్ ఫైట్

## మున్సిపోల్స్‌లో త్రిముఖ పోటీ

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 డివిజన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు జరిగిన ఎన్నికలకు ఓటర్లు పోటెత్తారు. చెదురుముదురు ఘటనలు మినహా ఎక్కడా పోలింగ్ కు అంతరాయం కలుగలేదు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకే అనేక పోలింగ్ కేంద్రాల్లో 50 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఐదు దాటినప్పటికీ ఓటు వేసేందుకు వచ్చిన పలువురు క్యూలైన్లలోనే వేచి ఉన్నారు. అయితే భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో 22వ వార్డులో నోట్ల కట్టలు కలకలం రేపాయి. స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి అనుచరులు ఒక్కో ఓటుకు రూ.5వేల వరకు డబ్బులు పంపిణీ చేస్తుండగా పోలీసులు అటుగా రావడంతో వాటిని అక్కడే వదిలేసి పారిపోయారు. దీంతో అక్కడ లభించిన రూ.లక్షనగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, జాతీయ పార్టీ బీజేపీలు హోరాహోరీ తలపడడంతో బిగ్ ఫైటే జరుగుతుందని చెప్పవచ్చు.

- వరంగల్ వాయిస్ బృందం

వివరాలు2లో..

# బిగ్ ఫైట్

- మున్సిపోల్స్ లో త్రిముఖ పోటీ
- ఉదయం నుంచే భారీ క్యూ లైన్లు
- మధ్యాహ్నం 1 గంటకే 50శాతం పైగా పోలింగ్
- సాయంత్రం 5 దాటినా క్యూలైన్ లోనే ఓటర్లు
- పలుచోట్ల చెదురుముదురు ఘటనలు
- భూపాలపల్లిలో నగదు కలకలం



**వరంగల్ వాయిస్ బృందం :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పలు ప్రాంతాల్లో చెదురుముదురు సంఘటనలు చోటుచేసుకున్నా పోలీసులు రంగప్రవేశం చేయడంతో పోలింగ్ కు ఎలాంటి అంతరాయం ఏర్పడలేదు. ఏడు కార్పొరేషన్లలోని 412 డివిజన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డుల్లో పోలింగ్ జరిగింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం క్యూలైన్లలో ఉన్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఉదయం మందకొడిగా సాగినా.. మధ్యాహ్నం తర్వాత ఓటు వేసేందుకు ప్రజలు పోలింగ్ బూత్ లకు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో పోలింగ్ శాతం గతంలో కంటే అధికంగా నమోదైంది.

### అంతా వెబ్ కాస్టింగ్ లో..

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఒకటి రెండు చోట్ల చిన్న చిన్న ఘర్షణలు తప్ప ఓటింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంతంగానే జరుగింది. ఉదయం నుంచి కొనసాగుతున్న పోలింగ్ సరళిని 100 శాతం వెబ్ కాస్టింగ్‌తో ఎన్నికల అధికారులు పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు 62.50 శాతం పోలింగ్ నమోదు అయింది. మున్సిపల్ కార్పొరేషన్లతో పోలిస్తే మున్సిపాలిటీలలో ఎక్కువ పోలింగ్ శాతం నమోదవుతుంది. కాగా సాయంత్రం 5గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

### 13న కౌంటింగ్..

కాగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ రోజు సాయంత్రంలోపు ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్లు అన్ని ఏర్పాట్లు చేశారు.



### నోట్ల కలకలం..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో నోట్ల కట్టలు కలకలం రేపాయి. 22వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి అనుచరుడు డబ్బులు పంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన వ్యక్తి డబ్బు కట్టలను అక్కడే విసిరేసి పరారయ్యాడు. వెంటనే స్పందించిన పోలీసులు సుమారు లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల వేళ ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# పెళ్లి పందిరిలా పోలింగ్ కేంద్రం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఫిదా
- 'హరిత పోలింగ్ కేంద్రం' అలంకరణపై ప్రశంసలు
- అధికారులతో కలిసి ఫొటోలు దిగిన సీపీ

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మున్సిపల్ ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కు ఒక అరుదైన అనుభవం ఎదురైంది. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యావరణ హితంగా ఏర్పాటు చేసిన 'హరిత పోలింగ్ కేంద్రం' కమిషనర్‌ను ఎంతగానో ఆకర్షించింది. సాధారణ పోలింగ్ కేంద్రాలకు భిన్నంగా, పచ్చని తోరణాలు, పూల మొక్కలు, రంగురంగుల అలంకరణలతో ముస్తాబైన ఈ కేంద్రాన్ని చూసి సీపీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఈ పోలింగ్ కేంద్రం చూస్తుంటే ఏదో పెళ్లి పందిరిలా ఎంతో ఆహ్లాదకరంగా ఉందంటూ" ఆయన అధికారులతో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఓటర్లకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో చేసిన ఈ ఏర్పాటును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ హరిత కేంద్రం వద్ద ఉన్న ప్రత్యేకతను చూసి ముగ్ధులైన కమిషనర్, అక్కడ ఉన్న ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఫోటోలు దిగారు. ఓటర్లను ఆకర్షించేలా ఇటువంటి వినూత్న ప్రయత్నాలు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో సీపీ వెంట ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

# ప్రజాస్వామ్య పండుగలో పర్యావరణ చైతన్యం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పురోత్సవంలో 'హరిత' కాంతి
- ఓటర్లకు జిల్లా కలెక్టర్ వినూత్న స్వాగతం
- ఓటేసిన వారికి పెన్నులు, రిస్ట్ బ్యాండ్‌ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను కేవలం ఓటింగ్ కింద మాత్రమే చూడకుండా, ఒక పచ్చని పండుగలా మార్చేందుకు వరంగల్ జిల్లా యంత్రాంగం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఓటర్లలో పర్యావరణ స్పృహ పెంచుతూనే, పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన హరిత, పర్యావరణ హిత పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం స్వయంగా సందర్శించి పరిశీలించారు. వర్ధన్నపేట ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనం, పరిశుభ్రతతో ఓటర్లకు ఆహ్లాదాన్ని పంచింది. ప్లాస్టిక్ రీసైక్లింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఏర్పాటు చేసిన అవగాహన బోర్డులు ఓటర్లను ఆలోచింపజేశాయి. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఓటరికి కలెక్టర్ స్వయంగా పెన్, "ఓటు" రిస్ట్ బ్యాండ్ అందజేసి అభినందించారు. సెల్ఫీ పాయింట్ల వద్ద ఓటర్లు ఉత్సాహంగా ఫోటోలు దిగారు. వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణహిత అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ అంశంతో రూపొందించిన ప్రత్యేక స్టేషన్‌లో అవగాహన బోర్డులు, సందేశాలు ఓటర్లను ఆలోచింపజేశాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చాటి చెప్పాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. "ఓటు హక్కు కేవలం అధికారం మాత్రమే కాదు, మన భవిష్యత్తు పట్ల మన బాధ్యత. పోలింగ్ ప్రక్రియను మరింత ఆహ్లాదకరంగా మార్చడం ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచవచ్చని భావిస్తున్నాం," అని పేర్కొన్నారు. ఈ వినూత్న ప్రయత్నం పట్ల ఓటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవోలు సుమా, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, తహశీల్దార్లు విజయ్, రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు
- శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

# పేదల పెళ్లిళ్లకు 'ప్రభుత్వ' భరోసా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1.59 కోట్ల చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేద ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ గోకుల్ నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో హనుమకొండ, కాజీపేట మండలాలకు చెందిన 159 మంది లబ్ధిదారులకు రూ.1,59,18,444 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దళారీ వ్యవస్థ లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయం పేద కుటుంబాల్లో కొండంత అండగా నిలుస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పుట్టినప్పటి నుంచి పెళ్లి వరకు ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోంది. అప్పుల పాలు కాకుండా గౌరవప్రదంగా వివాహాలు జరిపించడమే మా సంకల్పమని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదిమ నుంచి ఆధునిక మానవుడి వరకు..

- అబ్బురపరిచిన 'పరిణామ' నాటిక



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ప్రముఖ జీవశాస్త్రవేత్త చార్ల్స్ డార్విన్ జయంతిని పురస్కరించుకొని ధర్మసాగర్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో "డార్విన్ పరిణామ సిద్ధాంతం, మానవ నాగరికత పురోగతి" అనే అంశంపై జన విజ్ఞాన వేదిక (జేవీవీ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేధోమథన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జేవీవీ రాష్ట్ర పర్యావరణ ఉపసమితి కన్వీనర్ కె.బి.ధర్మ ప్రకాష్ ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. డార్విన్ ప్రతిపాదించిన 'సహజ వరణం' సిద్ధాంతం జీవ ప్రపంచంపై మానవుడి అవగాహనను మార్చివేసిందని పేర్కొన్నారు. ఆయన రాసిన "ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్" గ్రంథం జీవుల పరిణామ క్రమాన్ని శాస్త్రీయంగా నిరూపించిందని వివరించారు. కేవలం జీవశాస్త్రమే



కాకుండా, మానవ మేధస్సు, సంస్కృతి, భాషా వికాసం కూడా ఈ నిరంతర పరిణామ ప్రక్రియలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమలో విద్యార్థులు ప్రదర్శించిన "మానవ పరిణామం" నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదిమ కోతి నుంచి ఆధునిక మానవుడి వరకు జరిగిన మార్పులను, వివిధ పరిణామ దశలను విద్యార్థులు తమ అభినయంతో కళ్లకు కట్టినట్లు చూపారు. ఈ ప్రదర్శన ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతి విద్యార్థి మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ, శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని ధర్మ ప్రకాష్ పిలుపునిచ్చారు. సమాజ పురోగతికి శాస్త్రీయ ఆలోచనే పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవితా దేవి, సురేష్, కిరణ్మయి, రామకృష్ణ, రమ్యశ్రీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చేనేత కార్మికుల కష్టాలపై క్షేత్ర స్థాయి పర్యటన

- పింగిలి కళాశాల విద్యార్థినుల స్టడీ
- జీఐ ట్యాగ్ ఉన్నా అందని ఫలాలు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నపం




**వరంగల్ వాయిస్, కొత్తవాడ (వరంగల్):** ఒకప్పుడు మగ్గం శబ్దాలతో మురిసిన కొత్తవాడ వీధులు.. ఇప్పుడు మూగబోతున్నాయి. ఇంగ్లాండ్ మ్యూజియంలో సైతం కొలువైన కొత్తవాడ ధరిస్ (దరీల) ప్రతిభ, నేడు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. చేనేత రంగంలోని ఈ వాస్తవ పరిస్థితులను, 'జియోగ్రాఫికల్ ఇండికేషన్' ట్యాగ్ విశిష్టతను అధ్యయనం చేసేందుకు వడ్డేపల్లి పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బి.కామ్ విద్యార్థినులు క్షేత్ర పర్యటన నిర్వహించారు. కొత్తవాడ గ్రామం చేనేత కళాకారుల ప్రతిభకు పెట్టింది పేరు. ఇక్కడ తయారయ్యే ధరిస్ కేవలం దేశంలోనే కాకుండా విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి, కన్వీనర్ డాక్టర్ రాజు గుగులోత్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థినులు కొత్తవాడను సందర్శించి, కార్మికుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు విద్యార్థినులకు నేత రంగానికి ఎదురవుతున్న సవాళ్లను వివరించారు. పవర్‌లూమ్స్, యంత్రాలతో తయారయ్యే చౌకైన వస్త్రాల వల్ల చేనేతకు గిరాకీ తగ్గింది. ఒక దరీని తయారు చేయడానికి రోజుల తరబడి శ్రమిస్తున్నా, అందుకు తగిన పారితోషికం లభించడం లేదు. మార్కెట్ లాభాలు నేరుగా కార్మికులకు చేరకుండా మధ్యవర్తుల పరమవుతున్నాయి.నూలు, రంగుల ధరలు విపరీతంగా పెరగడం భారంగా మారింది. కొత్తవాడ ధరిస్‌కు లభించిన జీఐ ట్యాగ్ ప్రాముఖ్యతపై కూడా ఈ పర్యటనలో చర్చ జరిగింది. ఈ ట్యాగ్ వల్ల ఉత్పత్తికి చట్టబద్ధమైన గుర్తింపు లభిస్తుందని, నకిలీల నుంచి రక్షణ ఉంటుందని నిపుణులు తెలిపారు. అయితే, కేవలం గుర్తింపు ఉంటే సరిపోదని, ప్రభుత్వ మద్దతుతో కూడిన సమర్థవంతమైన మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు పెరిగినప్పుడే ఈ ట్యాగ్ ప్రయోజనం కార్మికులకు అందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు గ్రౌండ్ లెవల్‌లో సరిగ్గా అమలు కావడం లేదని కార్మికులు విద్యార్థినుల దృష్టికి తెచ్చారు. జంపకానల తయారీలో ప్రసిద్ధి చెందిన ఈ గ్రామం ఇప్పుడు తన ఉనికిని కోల్పోతోందని, యువత ఈ వృత్తికి దూరం కావడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థినులకు సామాజిక అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక కళలను కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసింది. ప్రభుత్వం, సమాజం స్పందించి చేనేత ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్, మార్కెట్ సౌకర్యాలు కల్పిస్తేనే ఈ అద్భుత కళ మళ్లీ జీవం పోసుకుంటుంది.



# ఎమ్మెల్యే నాయినికి శివరాత్రి మహోత్సవ ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో బుధవారం పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. 5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమాన్తో కలిసి పద్మశాలి సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి మహాశివరాత్రి జాగరణ మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పద్మశాలి పరపతి సంఘం కొత్తూరు ఫంక్షన్ హాల్ అభివృద్ధి కోసం గతంలో ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ.5,00,000 అంశాన్ని ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధులు శాంక్షన్ అయి చాలా రోజులు అవుతున్నందున, పనుల పురోగతి గురించి చర్చించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. శివరాత్రి పండుగ ముగిసిన వెంటనే ఫంక్షన్ హాల్ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పరపతి సంఘం (కొత్తూరు) ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తౌటం సంతోష్, ఉపాధ్యక్షుడు గుండు శ్రీనాథ్, కోశాధికారి బింగి సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో ఐఎఫ్ఎస్ అధికారి పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల అద్భుత కళాక్షేత్రం, చారిత్రక ప్రసిద్ధి గాంచిన గణపురం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయ (కోటగుళ్లు)ను ఐఎఫ్ఎస్ ప్రొబిషనరీ అధికారి చంద్ర ప్రకాష్ సింగాల్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని స్వామివారికి అధికారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో శాలువా కప్పి, పూలమాలతో చంద్ర ప్రకాష్ సింగాల్‌ను ఘనంగా సన్మానించారు. కాకతీయుల శిల్పకళా వైభవాన్ని, ఆలయ విశిష్టతను అధికారి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

# ఓటు వేయడం ప్రతి పౌరుని బాధ్యత

## గందే వెంకటేశ్వర్లు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరకాల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందే వెంకటేశ్వర్లు 17వ వార్డులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 34వ నంబర్ పోలింగ్ బూత్‌లో తన ఓటును వేశారు. ఓటు వేసిన అనంతరం గందే వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అది ప్రతి పౌరుని ప్రాథమిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. పట్టణ అభివృద్ధిని కాంక్షించే వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, ఫిబ్రవరి 11, 2026

# చదరంగంతోనే మానసిక వికాసం

- డాక్టర్ హరిణి బోయినపల్లి
- పాఠశాలలకు 300 చెస్ బోర్డుల పంపిణీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** విద్యార్థుల్లో మేధోశక్తిని, క్రమశిక్షణను పెంపొందించడంలో చదరంగం (చెస్) అద్భుతమైన పాత్ర పోషిస్తుందని ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ హరిణి బోయినపల్లి అన్నారు. చెస్ నెట్వర్క్ గ్లోబల్ ఫౌండర్ కొదాటి సుధీర్ (కెనడా), ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పర్వతగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెస్ బోర్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హరిణి బోయినపల్లి మాట్లాడుతూ.. చెస్ అనేది కేవలం ఆట మాత్రమే కాదని, అది సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం నేర్పుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎన్నారై కొదాటి సుధీర్ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ప్రభుత్వాలు కూడా క్రీడలకు పెద్దపీట వేస్తున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వాడుకోవాలని సూచించారు. చెస్ నెట్ వర్క్ ఫౌండర్ కొదాటి సుధీర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు, డిజిటల్ ఆకర్షణలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆ వ్యసనాల నుంచి బయటకు తీసుకురావడానికి చెస్ ఒక మంచి మార్గమని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఈ ఆట పట్ల ఆసక్తిని పెంచాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున మొత్తం 300 చెస్ బోర్డులు, కాయిన్స్, ట్రైనింగ్ బుక్స్‌ను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు వీటిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎంలు కె.నవీన్ కుమార్, గాయపు లింగారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విజయ్ కుమార్, రిటైర్డ్ ఎంఈఓ గంప అశోక్ కుమార్, వెనిశెట్టి రాజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని తహరాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన వడ్లూరి రాజయ్య కుటుంబాన్ని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి బుధవారం పరామర్శించారు. రాజయ్య మృతి పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి, మండల కోశాధికారి కుక్కల మహేష్, బిల్లా రాజ్ కుమార్, ఇతర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలింగ్ సరళి పరిశీలన

### క్షేత్రస్థాయిలో గంట రవికుమార్ ఆరా



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియను బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీలోని 12 వార్డులకు సంబంధించిన వివిధ పోలింగ్ కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐదు మున్సిపాలిటీల్లో సీపీ సుడిగాలి పర్యటన

### పోలింగ్ కేంద్రాల తనిఖీ

### బందోబస్తుపై అధికారులకు సూచనలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బుధవారం జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలోని రెండు కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును, ఓటర్ల క్యూ లైన్లను పరిశీలించి, భద్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ల ఇన్చార్జ్‌లుగా ఉన్న అధికారులకు సిపి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసర జనం గుమిగూడకుండా చూడాలని ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలతో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా కట్టుదిట్టమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. కమిషనర్ వెంట ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రా, ఏసీపీలు నర్సయ్య, భీం శర్మ, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గుజ్జారి రమేష్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 53వ వర్ధంతిని పురస్కరించుకొని, హనుమకొండలోని అమరావతి నగర్ (శాంతినికేతన్ అపార్ట్మెంట్)లో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అభినవ ఘంటసాల'గా పేరుగాంచిన గుజ్జారి రమేష్‌ను శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గుజ్జారి రమేష్ తన చిన్ననాటి మిత్రుడని, మహబూబియా పాఠశాలలో తాము కలిసి చదువుకున్న రోజుల్లోనే ఆయన ఘంటసాల పాటలను అద్భుతంగా ఆలపించేవారని గుర్తు చేసుకున్నారు. రమేష్ పాడుతుంటే సాక్షాత్తు ఘంటసాల గారే మన ముందున్నారా అన్నట్లుగా ఉంటుందని, అందుకే ఆయనను అందరూ 'ఓరుగల్లు ఘంటసాల' అని పిలుస్తుంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెండు మధురమైన పాటలు పాడి అతిథులను ఆనంద డోలికల్లో ముంచెత్తారు. సన్మానం అనంతరం గుజ్జారి రమేష్ మాట్లాడుతూ.. ఘంటసాల మాస్టారు యుగానికి ఒక్కరని, అటువంటి గాయకుడు మళ్ళీ పుట్టబోరని అన్నారు. వారి వర్ధంతి రోజున తన మిత్రుడు రాజేంద్రప్రసాద్ తనను గుర్తించి సన్మానించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కుటుంబ సభ్యులు సుగుణ, శైలజ, సుధాకర్, అపార్ట్మెంట్ నివాసితులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రతి కార్పొరేట్, వ్యాపార సంస్థ తమ లాభాల్లో కొంత భాగాన్ని సామాజిక బాధ్యత కింద సమాజ సేవకు వెచ్చించాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లలకు అవసరమైన వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. బ్యాంక్ జీఎం రిషికేష్ రంజన్ కుమార్, డాక్టర్ అనితా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పిల్లలకు బీరువా, బెడ్ షీట్లు, యాంటీ మస్కిటో మిషన్లు, స్వీట్లు, స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకులు కేవలం ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. మానసిక దివ్యాంగులకు సేవ చేయడం విశ్వమానవ సేవతో సమానమని, వారి అవసరాలను గుర్తించి ఆదుకున్న ఐఓబీ సిబ్బందిని ఆమె కొనియాడారు. ఐఓబీ పనితీరు ఇతర సంస్థలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఆశ్రమ పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను విశేషంగా అలరించాయి. బ్యాంక్ ప్రతినిధులు వసుధ, హరిత, బ్యాంక్ సిబ్బంది, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# పాఠశాలలో 'మేడారం' వైభవం

- విద్యార్థులచే సమ్మక్క-సారలమ్మ నాటక ప్రదర్శన



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర నేపథ్యాన్ని, ఆ వీరవనితల పోరాట చరిత్రను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించింది పరకాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. అంతరించిపోతున్న పురాతన కళారూపాలను రక్షించడంలో భాగంగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రదర్శించిన సమ్మక్క–సారలమ్మ కథాచిత్రీకరణ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. పూర్వకాలంలో కాకతీయ రాజుల కాలంలో పన్ను కట్టలేదన్న నెపంతో ఆదివాసీలపై జరిగిన దాడిని, దానికి వ్యతిరేకంగా సమ్మక్క–సారక్కలు సాగించిన వీరోచిత పోరాటాన్ని నాటకీయంగా ప్రదర్శించారు. ఈ యుద్ధంలో జంపన్న, పగిడిద్దరాజు, గోవిందరాజులు ఒక్కొక్కరుగా వీరమరణం పొందిన తీరు ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. చివరగా సమ్మక్క అడవిలోకి వెళ్లి అదృశ్యం కావడం, ఆ తర్వాత ప్రజలకు కుంకుమ భరణి రూపంలో దర్శనమివ్వడం వంటి ఘట్టాలను అత్యంత సహజంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో బొజ్జం గోత్రయని సమ్మక్క రూపంలో, మకర శ్రావణి సారలమ్మ రూపంలో పరకాయ ప్రవేశం చేసి ఆకట్టుకున్నారు. వారి వేషధారణ, ఆహార్యం చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. సాక్షాత్తు అమ్మవార్లే దిగివచ్చారా అన్నంతగా తమ నటనతో మెప్పించిన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది ఘనంగా ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు రాజయ్య మాట్లాడుతూ.. పుస్తకాల్లోని పాఠాలతో పాటు మన ప్రాంతీయ చరిత్రను, సంస్కృతిని విద్యార్థులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ పెరుగుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్రం కుట్రలను తిప్పికొడదాం..

- రేపటి సమ్మెను జయప్రదం చేయండి
- దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా బుధవారం అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ముగింపు సభలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. మోడీ సర్కారు గత 12 ఏళ్లుగా కార్మిక లోకానికి తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికుల గొంతు నొక్కడమేనని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం అందకుండా చేయడం, నిరసన తెలిపే హక్కు లేకుండా యూనియన్లను నిర్వీర్యం చేయడం కేంద్రం పన్నుతున్న అతిపెద్ద కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. రేపు జరగబోయే సమ్మెలో వ్యాపార సముదాయాలు, ఫ్యాక్టరీలు, కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఐక్యంగా పోరాడితేనే కేంద్రం తన మొండి వైఖరిని వీడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా కన్వీనర్ నాయిని రవి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూ ఉపాధ్యక్షులు సారంగపాణి, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, ఏఐసీటీయూ నాయకులు శ్రీనివాస రావుతో పాటు ఆటో యూనియన్లు, హోటల్ వర్కర్స్, పెయింటర్ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి అండగా ‘బొల్లం అజయ్ యువసేన’

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** అనారోగ్యంతో మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేయడం ద్వారా బొల్లం అజయ్ యువసేన సభ్యులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రఘునాథపల్లికి చెందిన కొంగరి రాజు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ నిన్న సాయంత్రం కన్నుమూశారు. రాజు మరణవార్త తెలిసిన వెంటనే ‘బొల్లం అజయ్ యువసేన’ సభ్యులు ఆయన నివాసానికి వెళ్లి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి తక్షణ సహాయం కింద ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండదండలుగా ఉంటామని, ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకుంటామని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో కల్పగురి హరినాథ్, గంధ ప్రదీప్, మోటమ్ రాఘవేంద్ర, జంగిలి శ్రీను, సనాతల అశోక్, మల్కాపురం అన్వేష్, లోనే శశిధర్, దుబ్బాక హరీష్, శాతరాశి నరేష్, పేర్ని ప్రసాద్, పేర్ని లెనిన్, కుక్కల నాగరాజు, చెరుకు అజయ్, కాదునూరి శశి, చీమలపాటి నాగరాజ్, దుబ్బాక రాహుల్, లింగారెడ్డి బాల మధు, బాలరాజు గాదే పాల్గొన్నారు.

# ఓటేసిన పాలకుర్తి ఎమ్మెల్యే

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి శాసనసభ్యురాలు ఎర్రబెల్లి యశస్విని రెడ్డి మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొర్రూరు మున్సిపాలిటీ 16వ వార్డులో ఓటరుగా నమోదైన ఆమె, పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




# దేశవ్యాప్త సమ్మెకు పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు

- విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపు




**వరంగల్ వాయిస్, కేయూ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న వివిధ సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో జరిగిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాష్ట్రాల అధికారాలను తన చేతుల్లోకి తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ఏకపక్షంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ చట్టం, విబిజి రాంజీ స్కీమ్‌లను నిలిపివేయాలి. పాత చట్టాలను పునరుద్ధరించి కార్మికులకు, రైతులకు న్యాయం చేయాలి. లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి లోకాన్ని సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రేపు జరిగే సమ్మెలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పీడీఎస్‌యూ శ్రేణులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్, కేయూ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షులు పి.అనూష, సహాయ కార్యదర్శి గణేష్, జిల్లా కోశాధికారి షరీఫా, నాయకులు యాదగిరి, స్వాతి, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలు తప్పదు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కోర్టు కఠినంగా స్పందించింది. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ సోదాల్లో పట్టుబడిన 16 మందిని బుధవారం వరంగల్ రెండో తరగతి మెజిస్ట్రేట్ నిధి రాజ్ ఎదుట హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్, నిందితులకు మొత్తం రూ.14,400 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా తప్పవని ఆమె హెచ్చరించారు. నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఢిల్లీ పరేడ్‌లో కాకతీయ కాలేజీ విద్యార్థి ప్రతిభ

## ‘శివ’కు ఘన స్వాగతం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ (రిపబ్లిక్ డే) పరేడ్‌లో పాల్గొని, జాతీయ స్థాయిలో కళాశాల కీర్తిని ఇనుమడింపజేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఉప్పల శివకు కాకతీయ ప్రభుత్వ కళాశాల (ఆటోనమస్)లో ఘన స్వాగతం లభించింది. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని కళాశాలకు వచ్చిన శివకు తోటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అపూర్వ స్వాగతం పలికారు. డ్రమ్స్ వాయిస్తూ, చప్పట్లు కొడుతూ కళాశాల ప్రధాన ద్వారం నుంచి ప్రిన్సిపాల్ కార్యాలయం వరకు శివను ఉత్సాహంగా తీసుకువచ్చారు. విద్యార్థుల కేరింతలతో కళాశాల ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల నుంచి ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన ఏకైక విద్యార్థి శివ కావడం మనందరికీ గర్వకారణమని కొనియాడారు. కఠినమైన శిక్షణను అధిగమించి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన శివ, భవిష్యత్తులో మరెన్నో శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మానం అనంతరం శివ మాట్లాడుతూ.. ఢిల్లీ రాజపథంలో పరేడ్ చేయడం తన జీవితంలో మరువలేని అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. తన పర్యటనకు ఆర్థికంగా, నైతికంగా తోడ్పాటునందించిన అధ్యాపకులు డా.రవికుమార్, డా.శివ నాగ శ్రీను, డా.సీతారాం,ఇతర అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సీతారాములు, డా.గంగిశెట్టి శ్రీనివాస్, ఎన్‌సీసీ ఆఫీసర్లు డా.రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా.శ్రీనాథ్, పరీక్షల నియంత్రణ అధికారి డా.శివ నాగ శ్రీను, పెద్ద సంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్వతాల శివాలయంలో శివరాత్రి మహోత్సవ సన్నాహాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో జరగబోయే శివరాత్రి మహోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్ చీదురు శంకర్ సన్నాహక కార్యక్రమాలను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, జంగిల్ కటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వీధిలైట్ల ఏర్పాటుతో పాటు భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఘు, మాజీ ఎంపీటీసీ మాదుగుల రాజు, వార్డు మెంబర్ హరీష్ నాయక్, దొడ్డ శ్రీనివాస్, వేణుగోపాల్, భేక్యా నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో పోలింగ్ ప్రశాంతం



**వరంగల్ వాయిస్,పరకాల :** పరకాల మున్సిపల్ ఎన్నికలలో 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో బుధవారం ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుండి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లతో ఎటువంటి అంతరాయం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వృద్ధులకు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహమని శాయంపేట మండల కేంద్రానికి చెందిన పాత మిత్రులు నిరూపించారు. శాయంపేటకు చెందిన బాసని సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గుర్తించిన చిన్ననాటి స్నేహితులు (1982-83 పదవ తరగతి బ్యాచ్) బుధవారం సాంబయ్య నివాసానికి వెళ్లారు. మొదట సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మిత్రులు, ఆయనతో తమకున్న పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సాంబయ్య కుటుంబానికి బాసటగా ఉంటూ అందరూ కలిసి పోగు చేసిన రూ.10,000/- ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు వలుపదాసి రమేష్, వినుకొండ శంకరాచారి, దుబాసి రవీందర్, శ్రీరామోజు జయప్రకాష్, పసునూటి ప్రకాష్, బూర ఈశ్వరయ్య, రేణిగుంట్ల ఐలయ్య పాల్గొన్నారు.

# ఎన్నికల మెడికల్ క్యాంపుల తనిఖీ



**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల (నార్మల్ డెలివరీస్) శాతాన్ని పెంచేలా వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.అప్పయ్య ఆదేశించారు. బుధవారం పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరకాల మున్సిపల్ పరిధిలోని గణపతి డిగ్రీ కాలేజ్ (డిస్ట్రిబ్యూషన్ సెంటర్), ఉర్దూ మీడియం స్కూల్, మల్లారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్, మాదారం, అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వంటి ఆరు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను సందర్శించారు. ఓటర్లకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. అనంతరం పరకాల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్ఓ, గత మూడు నెలల (నవంబర్, డిసెంబర్, జనవరి) ప్రసవాల రికార్డులను పరిశీలించారు. మొత్తం 81 ప్రసవాలు జరగగా, అందులో కేవలం 11 మాత్రమే సాధారణ ప్రసవాలు కావడం, మిగిలిన 70 సిజేరియన్లు (సీ-సెక్షన్ ) ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొదటిసారి గర్భం దాల్చిన తల్లులకు కూడా సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, వీలైనంత వరకు సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపాలని సూచించారు. రాయపర్తి, శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణీలను ప్రసవాల కోసం పరకాల ఏరియా ఆసుపత్రికి పంపేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. మొదటిసారి గర్భం దాల్చిన వారిలో కనీసం 70 శాతం మందికి సాధారణ ప్రసవం అయ్యేలా చూడాలని లక్ష్యంగా విధించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏరియా ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ బాలకృష్ణ, రాయపర్తి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ రాజకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నా తండ్రి ప్రాణాలకు రక్షణ కల్పించండి

- యూకే నుంచి ఎన్ఆర్ఐ రాజు విన్నపం
- ఇసుక మాఫియా నుంచి తండ్రికి ప్రాణహాని..
- డీజీపీ, సీపీలకు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తన వృద్ధ తండ్రి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు ప్రాణాలకు ముప్పు ఉందని, ఇసుక మాఫియా పక్కా పథకం ప్రకారం ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిందని బ్రిటన్‌లోని మాంచెస్టర్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు రాజు గజ్జెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ డీజీపీ బి.శశిధర్ రెడ్డి, వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అత్యవసర ఫిర్యాదును ఈ-మెయిల్ చేశారు. రాజు గజ్జెల్లి తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఐనవోలు మండలం నందనం గ్రామ శివార్లలోని ఆకేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా తన తండ్రి శ్రీరాములు (72) పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఈస్ట్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో జరిగిన ఇసుక తవ్వకాల తనిఖీలో పాల్గొని ఇంటికి వస్తుండగా, ఆగురురు వ్యక్తులు శ్రీరాములు వాహనాన్ని అడ్డుకుని, ఆయనను కారులో నుంచి బయటకు లాగి క్రూరంగా కొట్టారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యాయత్నమని రాజు ఆరోపించారు. స్థానిక పోలీసుల ప్రవర్తనపై రాజు గజ్జెల్లి తన లేఖలో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిందితుడు బర్ల రాజ్ కుమార్ నుంచి ముప్పు ఉందని ఏసీపీకి ముందే చెప్పినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. హత్యాయత్నం వంటి తీవ్రమైన ఘటనను కేవలం చిన్న గొడవగా చిత్రీకరించి సాధారణ కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేయాల్సిన ఐనవోలు ఎస్సై శ్రీనివాస్.. రివర్స్‌లో బాధితుడి కుటుంబ సభ్యులకే ఫోన్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరించడం దారుణమని పేర్కొన్నారు. తన తండ్రి డయాబెటిస్, బీపీ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తాజా దాడుల వల్ల ఆయన మానసిక స్థితి క్షీణించి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని రాజు వివరించారు. ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలని, పోలీసుల నుండి వస్తున్న బెదిరింపులను అరికట్టి తన తండ్రికి ప్రాణ రక్షణ కల్పించాలని ఆయన పోలీసు ఉన్నతాధికారులను వేడుకున్నారు.

# బాక్సుల్లో 'భవితవ్యం' భద్రం

- ముగిసిన మున్సిపల్ పోలింగ్
- ఉత్సాహంగా ఓటేసిన ప్రజలు
- 13న ఫలితాలు..
- ఉత్కంఠలో అభ్యర్థులు




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ బుధవారం సాయంత్రం 5 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ మున్సిపాలిటీతో పాటు ఇతర పట్టణాల్లో అక్కడక్కడ చిన్నపాటి వాగ్వాదాలు మినహా పోలింగ్ అంతా శాంతియుతంగా జరిగింది. పట్టణ ఓటర్లు మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి, భారీ పోలీసు భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే ప్రజల తీర్పు ఇప్పుడు ఆ బాక్సుల్లో భద్రంగా ఉంది. పోలింగ్ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి ఫలితాలపైనే నెలకొంది. ఈనెల 13న (శుక్రవారం) ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీలో పీఠం ఎవరికి దక్కుతుందోనని అటు రాజకీయ పార్టీల్లో, ఇటు సామాన్య ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డోర్నకల్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

# బాలికల జననాల తగ్గుదలపై నిఘా పెట్టండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ఆదేశం
- అబార్షన్ల వివరాలపై క్షేత్రస్థాయి విశ్లేషణ
- శాయంపేట పీహెచ్‌సీ తనిఖీ
- ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య పరీక్షలు తప్పనిసరి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** జిల్లాలో బాలికల జననాల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, గర్భస్రావాల (అబార్షన్ల)పై ప్రత్యేక విశ్లేషణ జరపాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.అప్పయ్య ఆదేశించారు. బుధవారం ఆయన శాయంపేట పీహెచ్‌సీతో పాటు నేరేడుపల్లి, ప్రగతి సింగారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరేడుపల్లి, ప్రగతి సింగారం కేంద్రాల్లో మాతా శిశు సంక్షేమ రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్ఓ, అక్కడ నమోదైన అబార్షన్ల వివరాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ జరిగిన 17 అబార్షన్లలో నలుగురు మహిళలకు ఇదివరకే ఆడపిల్లలు ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ 7 అబార్షన్లు జరగగా, అందులో ఇద్దరు మొదటిసారి గర్భం దాల్చిన వారు ఉన్నారని విశ్లేషించారు. లింగ వివక్ష కారణంగా అబార్షన్లు జరగకుండా చూడాలని, గర్భిణీలకు మరియు వారి కుటుంబ సభ్యులకు లింగ నిర్ధారణ పరీక్షల వ్యతిరేకతపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. శాయంపేట బాలికల ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించినప్పటికీ, వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రగతి సింగారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అందుతున్న ఆహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాయంపేట పీహెచ్‌సీలో మందులు, వ్యాక్సిన్ల నిల్వలను భౌతికంగా తనిఖీ చేశారు. సాధారణ ప్రసవాలు పెంచాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్ షెడ్యూల్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ వినోద్, డాక్టర్ విద్యాశ్రీ, హెల్త్ ఎక్స్టెన్షన్ అధికారులు సంపత్, విప్లవ కుమార్, పీహెచ్ఎన్ శోభ, సూపర్వైజర్లు భద్రయ్య, సీతారాం నాయక్, ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆ సమయంలో.. లాఠీ దెబ్బలు తిన్నా



## నటుడు సంతోష్ శోభన్ వెల్లడి

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కోసం ఒక ఘటనలో తాను కూడా లాఠీ దెబ్బలు తిన్నానని యంగ్ హీరో సంతోష్ శోభన్ తాజాగా వెల్లడించాడు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా ఎక్కువసార్లు చూడలేదని, అయితే ఒకసారి 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ సమయంలో ఆయనను చూసేందుకు వెళ్లిన అనుభవాన్ని పంచుకున్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'ఆ సమయంలో పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ చాలా ఎక్కువగా ఉండేది. షూటింగ్ అవుట్‌డోర్‌లో జరగడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు అక్కడున్న అభిమానులతో పాటు నాకు కూడా లాఠీ దెబ్బలు పడ్డాయి' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ వి□డియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్‌కు ముందు ఈ వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.



# ఇక డాక్టర్ శ్రీలీల

## ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి


టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.



# పవన్, సురేందర్ రెడ్డి కాంబో

## పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై `వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.



# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల

యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబ□ందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ క□ష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త వి□నన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ', 'సలార' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ `2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఓటీటీలోనూ దురంధర్ దూకుడు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది.




# పోలింగ్ బూత్‌ల కోసం ఓటర్ల పాట్లు..

- అధికారుల నిర్లక్ష్యంతో గందరగోళం
- గోడలపై వివరాలు లేక ఓటర్ల వెతుకులాట
- నిర్వహణపై ప్రజల ఆగ్రహం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం మధ్య ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టరేట్‌లో రెండు పర్యాయాలు శిక్షణ పొందిన సిబ్బంది, క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయడంలో విఫలమవ్వడంపై ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్, గర్ల్స్ ప్రైమరీ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సమాచారం కరువైంది. ఏ గదిలో ఏ బూత్ ఉందో తెలిపే వివరాలను గేటు వద్ద గానీ, గోడలపై గానీ ప్రదర్శించకపోవడంతో ఓటర్లు తమ బూత్ నంబర్ల కోసం అటు ఇటు వెతుక్కోవాల్సి వచ్చింది. ఉదయాన్నే ఓటు వేసి పనులకు, ప్రయాణాలకు వెళ్లాలనుకున్న వారు గంటల తరబడి పోలింగ్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి రావడంతో అసహనం వ్యక్తం చేశారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు వెళ్తే.. తమ ఓటు అక్కడ లేదని తెలియడంతో, మరో కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చిందని ఓటర్లు వాపోయారు.




### అధికారుల తీరుపై ఫిర్యాదులు..

ఓటర్ల ఇబ్బందులపై కొందరు అప్రమత్తమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉదయం 7:30 గంటల సమయంలో సిబ్బంది హడావుడిగా కాగితాలపై వివరాలు రాసి అతికించారు. అయితే, ఆ కాగితాలపై కూడా పోలింగ్ స్టేషన్, బూత్ వివరాలను తప్పుగా నమోదు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఓటర్లే స్వయంగా ఆ తప్పులను ఎత్తి చూపడంతో, సిబ్బంది తిరిగి వాటిని సరిదిద్దే పనిలో పడ్డారు. శిక్షణ పొందిన సిబ్బంది ఇలాంటి ప్రాథమిక ఏర్పాట్లలో విఫలం కావడం ఓటింగ్ శాతంపై ప్రభావం చూపుతుందని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాల వద్దే నోట్ల పంపిణీ

- భూపాలపల్లి, నర్సంపేటలో ఘటన
- ఓటుకు రూ.5 వేలు ఇస్తున్న వైనం
- నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి/ నర్సంపేట :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లో తీవ్ర కలకలం రేగింది. నిబంధనలను తుంగలో తొక్కి, పోలింగ్ కేంద్రాల సాక్షిగానే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు భారీగా నగదు పంపిణీ చేస్తున్న ఉదంతాలు వెలుగుచూశాయి. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు పోలింగ్ కేంద్రం సమీపంలో బీఆర్ఎస్ శ్రేణులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. పోలీసులను చూసి భయపడిన సదరు వ్యక్తులు తమ వద్ద ఉన్న నోట్ల కట్టలను నడిరోడ్డుపైనే విసిరేసి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలంలో సుమారు లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో ఓటుకు దాదాపు రూ.5,000 చొప్పున పంపిణీ చేస్తున్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. అటు వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. 24వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నగదు పంచుతున్న ఘటన బయటపడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. సమస్యాత్మక వార్డుల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.



## ములుగులో మున్సిపల్ పోలింగ్

# వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టర్ నిశిత పరిశీలన

- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- ప్రశాంతంగా సాగుతున్న పోలింగ్

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు కొత్త మున్సిపాలిటీకి జరుగుతున్న చారిత్రక తొలి ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టీఎస్ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి నిశితంగా పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా వివిధ పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా ఆయన ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు మున్సిపాలిటీకి ఇవే మొదటి ఎన్నికలని, ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు పడకుండా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఈడీఎం దేవేందర్, ఇతర ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం నాణ్యతపై పార్లమెంట్‌లో ఎంపీ కావ్య గళం

- కేంద్రాన్ని నిలదీసిన వరంగల్ ఎంపీ
- తెలంగాణలో ఒక్క ఫిర్యాదూ రాలేదు
- కేంద్ర మంత్రి జోషి సమాధానం

**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందుతున్న బియ్యం నాణ్యతపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. బుధవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా పీడీఎస్ బియ్యం నాణ్యత, తనిఖీలు, పారదర్శకతపై ఆమె సంధించిన ప్రశ్నలు చర్చనీయాంశమయ్యాయి. గత మూడేళ్లుగా పీడీఎస్ బియ్యం నాణ్యతపై అందుతున్న ఫిర్యాదుల స్థితిగతులు ఏమిటి?, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన తనిఖీల వివరాలను వెల్లడించాలి. నాణ్యత లోపిస్తే బాధ్యులపై తీసుకున్న చర్యలు మరియు పర్యవేక్షణకు అనుసరిస్తున్న పారదర్శక విధానాలేమిటి? అని ప్రశ్నించారు. ఎంపీ ప్రశ్నపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి స్పందించారు. తెలంగాణలో పీడీఎస్ బియ్యం నాణ్యతపై గత మూడేళ్లుగా కేంద్రానికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని ఆయన సభలో స్పష్టం చేశారు. తెలంగాణ 'డీసీపీ' రాష్ట్రం కావడంతో, ధాన్యం సేకరణ నుంచి నిల్వ, పంపిణీ వరకు 100 శాతం తనిఖీలు రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోందని తెలిపారు. ఎఫ్‌సీఐ–రాష్ట్ర సంయుక్త బృందాలు గత నాలుగేళ్లలో వందలాది తనిఖీలు నిర్వహించాయని (2025–26లో జనవరి వరకు 268 తనిఖీలు), ఎక్కడా మానవ వినియోగానికి అనర్హమైన ధాన్యం గుర్తించలేదని పేర్కొన్నారు. ఈ–పాస్ యంత్రాలు, ఆధార్ అనుసంధానం, 'మేరా రేషన్' యాప్ ద్వారా పారదర్శకతను పెంచినట్లు వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య చూపిన చొరవను రాజకీయ వర్గాలు అభినందిస్తున్నాయి.



# కేయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నరసింహ చారి

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల నూతన ప్రిన్సిపాల్, విభాగ అధిపతిగా ఆచార్య ఎస్.నరసింహ చారి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆచార్య పి.అమరావేణి పదవీకాలం ముగియడంతో, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య నరసింహ చారి ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారు. ఆచార్య నరసింహ చారికి విశ్వవిద్యాలయ పరిపాలనలో విశేష అనుభవం ఉంది. ఆయన గతంలో పరీక్షల నియంత్రణ అధికారిగా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, టీజీ ఐసెట్ కన్వీనర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఆయన విశ్వవిద్యాలయ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సంచాలకులుగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఆచార్య నరసింహ చారిని కామర్స్ విభాగం డీన్ ఆచార్య రాజేందర్ కట్ల, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య పి.వరలక్ష్మి, మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.అమరావేణి అభినందించారు. అలాగే డాక్టర్ ప్రగతి, డాక్టర్ ఫణీంద్ర, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com